సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న గిరిజన శక్తి కమిటీ సభ్యులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చింతల్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్ అన్నారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో తాగునీటి సరఫరా పై రెండు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ విషమై రెండు ఫిర్యాదులు, విద్యుత్ మోటార్ కు సంబంధించి మరో ఫిర్యాదు వచ్చింది. అనంతరం డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లతో ఆయన సమావేశమై సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎంలు రాజేశ్, రవికుమార్, సెక్షన్ మేనేజర్లు, ఎల్క్ట్రికల్ మేనేజర్ , సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో..

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్, గాజుల రామారం ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డిల అధ్యక్షతన ఉదయం 10: 30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో మొత్తం 6 ఫిర్యాదులు రాగా 2 టౌన్ ప్లానింగ్, 1 ఇంజనీరింగ్, 1 ఎలక్ట్రికల్, భూగర్భ డ్రైనేజీపై ఫిర్యాదులు వచ్చాయి. అలాగే గాజులరామారం సర్కిల్‌లో మొత్తం 9 ఫిర్యాదులు రాగా 4 టౌన్ ప్లానింగ్, 3 ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ 1, వెటర్నరీ 1 ఫిర్యాదులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్: ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఓ వెంచర్ నిర్వాహకులు విల్లాలు నిర్మించారని, వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన శక్తి కమిటీ సభ్యులు కోరారు. గండిమైసమ్మ–దుండిగల్ మండల పరిధి గాగిల్లాపూర్ సర్వేనంబర్ 204, 213 లో ఓ వెంచర్ నిర్వాహకులు 10 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపిస్తూ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది క్రితం ఈ విషయమై దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, సదరు స్థలాల్లో ఎలాంటి కట్టడాలు లేవని తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు సహకరించిన రెవెన్యూ అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర శరత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఈనెలలోనే లబ్ధిదారుల ఎంపికకు వార్డు సభలు
- దరఖాస్తు చేసుకోలేని వారి సభల్లో అర్జీలు అందించే ఛాన్స్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ



సాబేర్ అలీ, మున్సిపల్ కమిషనర్

నిజాంపేట్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే, అభివృద్ధి పనుల విషయంలో తీసుకుంటున్న చర్యలు, చెత్త డంపింగ్ తదితర సమస్యలపై తీసుకుంటున్న చర్యలపై కమిషనర్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు.?

కమిషనర్: మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,845 మంది, రేషన్ కార్డులకు మొత్తం 616 మంది దరఖాస్తు చేసుకున్నారు. వార్డు ఆఫీసర్లు దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. ఈనెల 21 నుంచి 25 వరకు అర్హుల డేటాను ఎంట్రీ చేస్తాం.

ప్రశ్న: లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది?

జవాబు: ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే వార్డు (నగర) సభల్లో ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం నాటి నుంచి లబ్ధిదారులకు రేషన్ కార్డులు జారీ చేస్తాం. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ ఇస్తాం.

ప్రశ్న: అర్హులందరికీ పథకాలు అందుతాయా.?

జవాబు: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరికీ రేషన్ కార్డులు వస్తాయి. అర్హత లేని వారు దరఖాస్తు చేసుకుంటే తిరస్కరిస్తాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హుల జాబితాను సిద్ధం చేస్తాం . తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.

ప్రశ్న: గతంలో దరఖాస్తు చేసుకోని వారి పరిస్థితి ఏంటి.?

జవాబు: ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోకుంటే ఆందోళన చెందవద్దు. అలా ఎవరైన ఉంటే ఈనెల 21 నుంచి 24 వరకు ఆయా వార్డుల్లో జరిగే సభల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. వాటిని కూడా పరిగణలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

ప్రశ్న: పనుల విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: డివిజన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు అవసరం ఉన్న వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పాలక వర్గం పదవీ కాలం అయిపోయిన తరువాత సైతం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ప్రశ్న: చెత్త డంపింగ్ సమస్యకు ఏం చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: చెత్త డంపింగ్ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఉన్న చెత్తను జవహర్‌నగర్‌కు తరలిస్తున్నాం. త్వరలోనే ఇక్కడి నుంచి కూడా శాశ్వతంగా చెత్త డంపింగ్‌ను తొలగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

కాలనీల అభివృద్ధికి సహకారం అందిస్తా



ఎమ్మెల్యే వివేకానంద్‌తో సంక్షేమ సంఘం నేతలు

కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని, అందుకు తన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ (వెస్ట్) నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా కాలనీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు ఎం. నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీశ్ చక్రవర్తి, కోశాధికారి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాధర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివాధన్, సభ్యులు శ్రీశైలం, రమేశ్, మారుతి, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గాజులరామారం డివిజన్ మెట్కానిగూడ అయ్యప్ప కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సైతం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిశారు. ఆయన వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సంక్షేమ సంఘం సభ్యులు రవిశంకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సీహెచ్. పూర్ణ, నరేంద్రనాథ్ సర్కార్, బి. రాజేశ్వర్, ఏ. ఆర్‌సీ రెడ్డి మోహన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రవికుమార్ గియ్యర్, ఆనంద్, జయరాం, కిరణ్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలి



సుభాష్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ డీటీ మల్లికార్జున్ రావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోందని స్థలం కేటాయించాలని ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించామన్నారు. దీంతో కలెక్టర్ నుంచి తహసీల్ కార్యాలయానికి ఆదేశాలు రావడంతో డీటీని కలిశామని పేర్కొన్నారు. వెంటనే ఆయన స్థలాన్ని పరిశీలించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

నిజాంపేట్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలకు అక్కడి ప్రభుత్వం పరిహారం అందించింది. ఇందులో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండారి లేవుట్‌కు చెందిన సావిత్రి, సాంబశివారెడ్డి తొక్కిసలాటలో గాయపడ్డారు. దీంతో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నర్సిరెడ్డిల బాధితుల ఇళ్లకు వెళ్లి రూ. 2 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెక్కులు అందజేస్తున్న టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి

నిందితులు లొంగిపోకుంటే ఆస్తుల జప్తు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో కేసులు నమోదై తప్పించుకు తిరుగుతున్న వ్యక్తులపై మేడ్చల్ 12వ అడిషనల్ జ్యూడిషియల్ క్లాస్ మెజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్లను జారీ చేశారు. సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం ముజఫర్‌నగర్‌కు చెందిన అనిల్‌రాయ్ (32) పై 337, 336, 304–ఏ సెక్షన్ల కింద, ఉత్తరప్రదేశ్ మధురై జిల్లాకు చెందిన బ్రిజ్వాసీ (20)పై సెక్షన్ 304–ఏ, ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీకాంత్(25) పై 302, 201, 120 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయన్నారు. పై వ్యక్తులు పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నెల 25లోగా మేడ్చల్ కోర్టులో లేదా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని లేకుంటే వారి ఆస్తులు జప్తు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

అంబేడ్కర్ సర్కిల్‌గా బోర్డు ఏర్పాటు చేయండి

నిజాంపేట్: ప్రగతినగర్ కమాన్ సర్కిల్‌ను అంబేడ్కర్ సర్కిల్‌గా మార్చాలని అంబేడ్కర్ సంఘాల నాయకుడు మల్లికార్జున్ కోరారు. ప్రగతినగర్ కమాన్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా హాజరైన విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డిని కలిశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో సర్కిల్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని తీర్మానం చేశారని అయినప్పటికీ అక్కడ ఎలాంటి బోర్డు ఏర్పాటు చేయలేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందిస్తూ వెంటనే సర్కిల్‌కు అంబేడ్కర్ పేరును ఏర్పాటు చేస్తామని వారు హామీనిచ్చారు.

జగద్గిరినగర్‌లో పర్యటన



పాదయాత్ర చేస్తున్న శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీలోని పలుచోట్ల మురుగునీరు పొంగిపొర్లుతున్నదని, బోరు మోటార్లు పనిచేయడం లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు జగన్ ముదిరాజ్, ముత్యాలు, సత్తిరెడ్డి, వెంకటేశ్ శివరెడ్డి, భిక్షపతి, రాజు, రవి, యాదిగిరి, రాజు, సుధాకర్, వేణు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



సతీశ్‌సాగర్‌ను సత్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాడాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించార. కొంపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దబుద్దుల సతీశ్ సాగర్ ఆయనను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ సతీశ్ సాగర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు డా. మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరిత రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, ఓబీసీ అధ్యక్షుడు అశోక్, కొంపల్లి బీజేపీ నాయకులు చక్రధర్, మధు, దుర్గ, గోపాల్ రెడ్డి, ప్రకాశ్ రావు, నర్సింగ్, మహేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లో ఈనెల 21 నుంచి సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 వరకు సభలు కొనసాగుతాయన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు సర్వే, రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ మతీన్, రెవెన్యూ అధికారి జి ప్రభాకర్, మేనేజర్ బి లక్ష్మయ్య, మున్సిపల్ ఇంజినీర్ బి సురేందర్ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి సంజన, వార్డ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో..

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆహార భద్రత (రేషన్) కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా వంటి పథకాలకు సంబంధించి ఈనెల 21, 22న వార్డు సభలు నిర్వహించనున్నట్లు కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొంపల్లి పురపాలక సంఘ పరిధిలోని 18 వార్డుల్లో వార్డుకొక ఆఫీసర్‌ను నియమించామని స్థానిక కౌన్సిలర్, కమిటీ సభ్యులు పాల్గొనే సమావేశాల్లో స్థానికులు పాల్గొనాలని ఆయన కోరారు.

'వేయిగొంతుకలు-లక్ష డప్పుల'కు తరలిరండి



నిజాంపేట్ : ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'వేయిగొంతుకలు–లక్ష డప్పుల' కార్యక్రమానికి మాదిగ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్వై అశోక్ పిలుపునిచ్చారు. నిజాంపేట్‌లోని హనుమాన్ టెంపుల్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల విగ్రహాల వద్దకు ఆదివారం రాత్రి 50 డప్పులతో ర్యాలీగా వెళ్లారు. నిజాంపేట్ పలు బస్తీల మాదిగ, ఉపకులాల నాయకులతో నిజాంపేట్ దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మేకల నగేశ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎస్వై అశోక్, ఎంజేఎఫ్ రాష్ట్ర సీనియర్ జర్నలిస్టు ముక్కెర్ల లాలయ్య మాదిగ, మహాజన వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కో కన్వీనర్ డప్పు రామస్వామి, మేకల నగేశ్ మాదిగ, మేడ సంజీవ, జలగం చంద్రయ్య, బుర్కి రాములు, మేకల బాలకృష్ణ, ప్రేమ్ కుమార్, మేకల క్రాంతి, రామకృష్ణ, బాలప్రీరు తదితరులు పాల్గొన్నారు.

ఏటా జాతర జరిపించండి

భవిష్యవాణిలో రాజేష్



రంగంలో భవిష్యవాణి వినిపిస్తున్న రాజేశ్

సుభాష్‌నగర్: 'నన్ను ప్రతిష్ఠించి 50 ఏళ్లు అవుతుంది..అప్పటి నుంచి మిమ్మల్ని కాపాడుకుంటూ వస్తున్నా.. ఇకముందు కూడా ఏటా జాతరను జరపండి మీకు ఏమీ జరగకుండా చూసుకుంటా' అంటూ గాజులరామారం చిత్తారమ్మ జాతరలో సోమవారం జరిగిన రంగంలో రాజేశ్ భవిష్యవాణిని వినిపించాడు. అంతకుముందు డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు ఎలాంటి ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు చేపట్టారు. 21 నుంచి 24 వరకు కుంకుమార్చనలు జరుగుతాయని, 25న అన్నదానంతో జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, కార్యదర్శి బాలరాజు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేశానని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి అన్నారు. గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం చివరి సర్వసభ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, కౌన్సిల్ సభ్యుల సహకారంతో మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. తనకు సహకరించిన సహచర కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందికి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కౌన్సిలర్లు, సిబ్బందిని సన్మానించారు. వైస్ చైర్మన్ పద్మారావు, తహసీల్దార్ మతీన్, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, ఏఈ సురేందర్ నాయక్, ఆర్వో ప్రభాకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో కౌన్సిలర్లు

అభివృద్ధిలో నిజాంపేట్ ఆదర్శం

- రూ. 8.69 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- ప్రారంభ సమయం చెప్పలేదని అధికారులపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ఆగ్రహం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పరస్పర నినాదాలతో కాసేపు ఉద్రిక్తత



జై తెలంగాణ , జై కేసీఆర్ నినాదాలు చేస్తున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాలాజీ నాయక్



పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: అభివృద్ధిలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో సుమారు రూ. 8.69 కోట్ల నిధులతో చేపట్టిన పనులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్‌లు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పెద్దఎత్తున నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయడం మంచి పరిణామమని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అంతా కలిసికట్టుగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. హైదరాబాద్‌లో నిజాంపేట్ కార్పొరేషన్‌ను మోడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, కొలను శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కాంగ్రెస్ ,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రారంభోత్సవ ఖచ్చిత సమయం తనకు తెలియజేయలేదని ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరస్పరం పలకరించుకున్న విప్, ఎమ్మెల్యే

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా మొదట విప్ మహేందర్‌రెడ్డి ఒక్కరే అక్కడకు చేరుకున్నారు. కొద్దిసేపటి వరకు ఎమ్మెల్యే వివేకానంద్ రాలేదు. దీంతో మహేందర్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేసుకుంటూ వచ్చారు. మధ్యలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం పలకరించుకుని కాసేపు మాట్లాడుకున్నారు.

పరస్పర నినాదాలతో రసాభాస

ప్రగతినగర్ కమాన్ వద్దకు రాగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు కార్పొరేటర్లు తమతమ పార్టీలకు అనుకూలంగా నినాదాలు చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అలర్ట్ అయి వెంటనే నినాదాలు చేస్తున్న వారిని అదుపు చేశారు. దీంతో కొద్దిసేపు జరిగిన రసాభాసతో పరిసర ప్రాంతాల్లో ఏమి జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని పరిస్థితిని అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ హైటెన్షన్ లైన్ ఫీడర్ పరిధిలోని పెన్షన్ లైన్, ఆర్య సమాజ్, కంసారి బజార్, పెద్ద తొకట్ట, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు న్యూ బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ సీతారాంపురం ఫీడర్ పరిధిలో సీతారాంపురం, మర్రి రాంరెడ్డి కాలనీ, గణేశ్ కాలనీ, కల్యాణ్ థియేటర్ రోడ్డు, సిండికేట్ బ్యాంక్‌కాలనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్న తొకట్ట సబ్ స్టేషన్ మహాత్మానగర్ ఫీడర్ పరిధిలో మహాత్మానగర్, బాపూజీ నగర్, సౌజన్య కాలనీ, సీతారాంపురం, జయ నగర్, శ్రీ సాయి రెసిడెన్సీ, ప్రీతి అపార్ట్‌మెంట్, కెనరా బ్యాంక్, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, సునైన టవర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నిజాంపేట్ : మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ రామ్‌నరేశ్ నగర్ ఓహెచ్ పరిధిలో ప్రాంతాలు ఏఎస్‌రాజు నగర్, మిత్ర హిల్స్, ప్రశాంత్‌నగర్ అలాగే హెచ్ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ నందమూరి నగర్ పరిధిలో హోలిస్టిక్ హాస్పిటల్, నిజాంపేట్ ప్రధాన రహదారి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో ఆర్ఏఎస్ స్టూడెంట్ బ్రాంచ్ షురూ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రేయారెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ అందుబాటులోకి వచ్చింది. ఐఈఈఈ హైదరాబాద్ విభాగం చైర్మన్ డాక్టర్ సుదర్శన్ జయబాలన్, కళాశాల డైరెక్టర్ శ్రేయారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ఈసీఈ విభాగం హెచ్ఓడీ ఎస్‌వీఎస్ ప్రసాద్, ఆర్ఏఎస్ ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ మనోజ్, డీన్ డాక్టర్ రాధికా దేవి, అధ్యాపకుల బృందం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలి



కుత్బుల్లాపూర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ.నాగ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్‌పీఎల్ కాలనీలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా నిత్యావసరాలు సరఫరా చేసే డెలివరీ బాయ్స్‌కి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, రాంగ్ రూట్‌లో, మితిమీరిన వేగంతో నడిపినా చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల నిరసన

నిజాంపేట్ : తుక్కుగూడ ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడిని ఉపాధ్యాయులు ఖండించారు. ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు పీఆర్‌టీయూటీఎస్ బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిజాంపేట్ జడ్పీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి,సిటీబ్యూరో: ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీతోసహా బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15 నుంచి రాష్ట్రంలోని 12 టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారం నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తోపాటు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040–24071178 ఫోన్ నెంబర్ సంప్రదించాలని ఆమె సూచించారు.